విస్తారా విమానంలో సాంకేతికలోపం

- 20 నిమిషాలు గాల్లోనే చక్కర్లు కొట్టిన పైలట్
- మరో విమానంలో ప్రయాణికుల తరలింపు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ) : శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి గురువారం సాయంత్రం టేకాఫ్ అయిన UK-880 విస్తారా విమానంలో టెక్నికల్ సమస్య తలెత్తింది. దీంతో పైలట్ 20 నిమిషాలపాటు గాల్లోనే చక్కర్లు కొట్టాడు. సాంకేతికలోపంతో అప్రమత్తమైన పైలట్ తిరిగి శంషాబాద్‌లోనే విమానాన్ని ల్యాండ్ చేశాడు. ఫ్లైట్‌లో 180 మంది ప్రయాణికులు ఉన్నారని, మెయింటనెన్స్ కారణంగానే అత్యవసర ల్యాండ్ అయినట్టు విస్తారా యాజమాన్యం ప్రకటించింది. ప్రయాణికులను వేరే ఫ్లైట్‌లో ఢిల్లీకి తరలించారు.

ఉత్కంఠ రేకెత్తించిన ఎయిర్ ఇండియా

తిరుచ్చిలో సురక్షిత ల్యాండింగ్

చెన్నై, అక్టోబర్ 11: తమిళనాడులోని తిరుచ్చిలో ఓ ఎయిర్ ఇండియా విమానం ఉత్కంఠకు గురి చేసింది. తిరుచ్చి నుంచి షార్జాకు వెళ్లేందుకు 141 మంది ప్రయాణికులతో శుక్రవారం సాయంత్రం 5.45కు బయలుదేరిన బోయింగ్ 737 విమానంలో కొద్దిసేపటికే హైడ్రాలిక్ వ్యవస్థలో సాంకేతిక లోపం ఏర్పడింది. దీంతో విమానాన్ని తిరిగి తిరుచ్చి ఎయిర్‌పోర్టులో ల్యాండింగ్ చేయాలని నిర్ణయించారు. అయితే ల్యాండింగ్ గేర్ పనిచేయకపోవచ్చునని భావించి ఇంధనం ఖాళీ కోసం విమానాన్ని రెండు గంటలపాటు గాలిలో చక్కర్లు కొట్టించారు. తర్వాత బెల్లీ ల్యాండింగ్ చేయించాలని నిర్ణయించగా ల్యాండింగ్ గేర్ పనిచేయడంతో రాత్రి 8.15 గంటలకు విమానం సురక్షితంగా తిరుచ్చి ఎయిర్‌పోర్ట్‌లోనే ల్యాండ్ అయ్యింది.

సోయా రైతుకు సర్కారు టోపీ!

- కేంద్రం కోటాలో కొనుగోలుకు మార్క్‌ఫెడ్ నిర్ణయం
- ఉత్పత్తి అంచనా 2.60 లక్షల టన్నులు..
- కొనుగోలుకు 56వేల టన్నులే అనుమతి
- మిగిలిన పంటపై చేతులెత్తేసిన రాష్ట్ర ప్రభుత్వం
- మ్యానిఫెస్టోలో ప్రకటించిన బోనస్ కూడా బోగస్సే
- పైగా పంట కొనుగోలుకు క్యాప్ నిబంధనలు
- ప్రభుత్వ నిర్ణయంపై సోయారైతుల ఆగ్రహం

ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు వచ్చిన సోయాబీన్

హైదరాబాద్/ఆదిలాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): మార్కెట్లో సోయాబీన్ ధర భారీగా పడిపోయింది. మద్దతు ధర క్వింటాలుకు రూ. 4892 ఉండగా మార్కెట్లో కేవలం రూ. 3500 నుంచి రూ. 4వేల లోపే ధర పలుకుతున్నది. ఎన్నికల సమయంలో పంట మద్దతు ధరకు అదనంగా రూ.450 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు బోనస్ సంగతి దేవుడెరుగు కనీసం మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు కూడా వెనకంజ వేస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కేంద్రం కోటాలోనే కొనుగోళ్లు...

సోయాబీన్ ధరలు పడిపోవడంతో పంట కొనుగోలుకు కేంద్రం అంగీకరించింది. కేంద్ర నిబంధనల ప్రకారం మొత్తం ఉత్పత్తిలో 25శాతం అనగా 56,550 టన్నుల సోయాబీన్ కొనుగోలుకు ఆదేశించింది. పంట కొనుగోలుకు మార్క్‌ఫెడ్ మొత్తం 37 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం అధికారులు 13 కేంద్రాలు ప్రారంభించి 50 టన్నుల సోయాబీన్ కొనుగోలు చేశారు. ఈ సీజన్‌లో సుమారు 4 లక్షల ఎకరాల్లో సోయాబీన్ పంట సాగు కాగా 2.60 లక్షల టన్నుల ఉత్పత్తి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. కేంద్ర ప్రభుత్వం 56వేల టన్నులు మాత్రమే కొనుగోలుకు ఆదేశించింది. అంటే మిగిలిన 2.04 లక్షల టన్నుల పంటను ఎవరు కొనుగోలు చేయాలనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. వాస్తవానికి మిగిలిన పంటను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలి. కానీ ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదు.

బోనస్ హామీ... బోగసేనా ?

ఎన్నికలకు ముందు సోయాబీన్ పంటలకు బోనస్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పొందుపరిచింది. నిరుడు మద్దతు ధర రూ. 3950 ఉండగా కాంగ్రెస్ పార్టీ రూ. 4400(రూ. 450 లేదా 11 శాతం బోనస్) లకు కొనుగోలు చేస్తామని ప్రకటించింది. ఈ లెక్కన ప్రస్తుతం సోయాబీన్ మద్దతు ధర రూ. 4892గా ఉండగా అదనంగా రూ. 450 బోనస్ కలిపి రూ. 5342కు కొనుగోలు చేయాలి. ఒకవేళ శాతం ప్రకారం లెక్కిస్తే రూ. 5430 ధరకు కొనుగోలు చేయాలి. కానీ ప్రభుత్వం ఏ ధరకూ కొనుగోలు చేయడం లేదు. అంతేగాక అసలే ధర లేక ఇబ్బంది పడుతున్న రైతులపై ప్రభుత్వం పిడుగు వేసింది. ఎకరాకు 6.52 క్వింటాళ్లను మాత్రమే కొనుగోలు చేయాలని నిర్ణయించింది. దీంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ క్యాప్ నిబంధనపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి కోతలు, క్యాప్ పెట్టకుండా మొత్తం పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

రూ.22 వేలు నష్టం..

నేను ఆరెకరాల్లో సోయా సాగు చేశా. ఎకరాకు 10 క్వింటాళ్లకు పైగా వచ్చింది. ఆరెకరాల్లో 65 క్వింటాళ్ల పంట తీశా. ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు సోయాను అమ్మకానికి తీసుకొచ్చా. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎకరాకు ఆరున్నర క్వింటాళ్లు మాత్రమే తీసుకుంటామని కొనుగోలు కేంద్రం సిబ్బంది అంటున్నారు. ఈ లెక్కన నేను 40 క్వింటాళ్ల పంటను మాత్రమే విక్రయించే అవకాశం ఉంది. మిగిలిన ఉత్పత్తులను ప్రైవేటు వ్యాపారులకు అమ్మాలి. సర్కారు నిర్ణయంతో రూ.22 వేలు నష్టపోవాల్సి వస్తున్నది.

- రాము, ఖోడద్, తలమడుగు

15 క్వింటాళ్లు మిగులుతుంది

నాలుగెకరాల్లో సోయా వేశా. 40 క్వింటాళ్ల పంటను ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు తీసుకొచ్చా. ఇక్కడ ఎకరానికి ఆరున్నర క్వింటాళ్లు మాత్ర మే కొంటామని అంటున్నారు. ఈ లెక్కన ఇంకా 15 క్వింటాళ్లు మిగులుతుంది. ప్రైవేటు వ్యాపారులకు అమ్మితే రూ.14 వేల నష్టం వస్తుంది. మార్కెటింగ్ సిబ్బంది 13 శాతం తేమ ఉన్నా పంటను తీసుకోవడం లేదు.

- తిరుమలేశ్, తంతోలి, ఆదిలాబాద్ రూరల్ మండలం

చిట్యాల వద్ద మంటల్లో దగ్ధమవుతున్న లారీ

బ్రిడ్జిని ఢీకొట్టిన లారీ.. పేలిన డీజిల్ ట్యాంకు

- మంటలు చెలరేగి దగ్ధం
- జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం

చిట్యాల, అక్టోబర్ 11 : సిమెంటు లారీ బ్రిడ్జిని ఢీకొట్టడంతో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటన శుక్రవారం ఉదయం నల్లగొండ జిల్లా చిట్యాలలో 65వ జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ వైపు నుంచి సిమెంటు లోడ్ లారీ హైదరాబాద్ వైపు వెళ్తున్నది. ఆ లారీ చిట్యాలలోని రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిని దాటిన తర్వాత ఉన్న బ్రిడ్జిని ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ డీజిల్ ట్యాంకు బ్రిడ్జికి తగిలి పేలిపోవటంతో మంటలు చెలరేగి లారీ దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. రోడ్డుపై లారీ దగ్ధం కావడంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దాంతో పోలీసులు ట్రాఫిక్‌ను ఒకే వైపు మళ్లించి, దగ్ధమైన లారీని అడ్డు తొలగించారు. ఈ ఘటనపై ఫిర్యాదు రానందున కేసు నమోదు చేయలేదని ఎస్సై తెలిపారు.

వీఎన్ఈఎస్ లైసెన్స్ రద్దు

యాజమాన్యం సందేశాలకు స్పందించొద్దు : మహబూబ్ కాలేజ్

హైదరాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): వెంకట్ నారాయణ ఎడ్యుకేషనల్ సొసైటీ (వీఎన్ఈఎస్) లైసెన్సును రద్దు చేసినట్టు మహబూబ్ కాలేజ్(మల్టీ పర్పస్ హైయర్ సెకండరీ స్కూల్ సొసైటీ) శుక్రవారం ప్రకటనలో వెల్లడించింది. స్వామి వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎస్‌వీఐటీ), స్వామి వివేకానంద పీజీ కాలేజ్(ఎస్‌వీపీజీ), బాల్టన్ స్కూల్ వంటి విద్యాసంస్థలు ఇప్పటివరకు వీఎన్ఈఎస్ ఆధ్వర్యంలో నడిచాయని, ప్రస్తుతం తమ నియంత్రణలోకి తీసుకున్నట్టు మహబూబ్ కాలేజ్ తెలిపింది. ఈ విషయంపై హైకోర్టును ఆశ్రయించగా అనుకూలంగా తీర్పు వచ్చినట్టు పేర్కొన్నది. వీఎన్ఈఎస్ అధ్యక్షుడు డాక్టర్ కేవీకే రావు, ఆయన కుమారుడుకే శ్రీహర్ష శశాంక్, సభ్యుల జోక్యం, బెదిరింపుల కారణంగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సి వచ్చినట్టు మహబూబ్ కాలేజ్ తెలిపింది. విద్యార్థులు, తల్లిదండ్రులు, బోధన, బోధనేతర సిబ్బంది వీఎన్ఈఎస్ సభ్యుల నుంచి వచ్చే సందేశాలకు స్పందించొద్దని సూచించింది.

కులమతాలకతీతంగా స్కూళ్లు

- రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్
- యాదవులపల్లెలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి భూమిపూజ

భూమి పూజ చేస్తున్న మంత్రి పొన్నం, ఎమ్మెల్యే కవ్వంపల్లి, కలెక్టర్ పమేలా సత్పతి

తిమ్మాపూర్, అక్టోబర్ 11: విద్యార్థులకు కులమతాలకతీతంగా విద్యనందించేందుకు అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం తిమ్మాపూర్ మండల కేంద్రంలోని యాదవులపల్లెలో 20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవనాల నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పండుగ పూట మానకొండూర్ నియోజకవర్గంలో మంచి కార్యక్రమం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో మొదటి దశలో 28 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు శంకుస్థాపన జరిగిందని, అదేస్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను బతికించుకునేందుకు అధిక నిధులు కేటాయించి మరమ్మతులు చేయించామన్నారు. పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, చిన్ననాటి నుంచే సామాజిక అసమానతలు ఉండకూడదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ పాఠశాలలను రూపొందించారని, మొదటి విడుతలో మానకొండూర్ నియోజకవర్గానికి కేటాయించడం హర్షణీయమని తెలిపారు. స్థల పరిశీలన చేసి అప్పగించిన కలెక్టర్, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు ప్రపుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్, ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నిల్వ చేసిన మాంసం, పదార్థాలను తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

బూజెక్కిన కూరగాయలు.. కాలం చెల్లిన ముడిసరుకులు

- కరీంనగర్‌లోని మైత్రి రెస్టారెంట్, మిఠాయివాలా స్వీట్‌షాపుల్లో ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ తనిఖీ
- బయటపడ్డ హానికరమైన ఆహారం
- తుప్పు పట్టిన పాత్రల్లోనే వంటలు

విద్యానగర్, అక్టోబర్ 11 : బూజెక్కిన కూరగాయలు.. తుప్పు పట్టిన వంట పాత్రలు.. కాలం చెల్లిన ముడిసరుకులు.. ప్రమాదకరమైన రంగులు కలిపిన స్వీట్లు.. ఇలా ఆరోగ్యానికి హాని చేసే ఆహార పదార్థాలు కరీంనగర్‌లోని ఓ రెస్టారెంట్, స్వీటు షాపులో రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారులు చేసిన తనిఖీల్లో బయటపడ్డాయి. రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆదేశాల మేరకు హెడ్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వీ జ్యోతి రమ్యి ఆధ్వర్యంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రోహిత్ రెడ్డి, పీ స్వాతి, శీర్షిక బృందం పట్టణంలోని మైత్రి హోటల్‌లో గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ రిఫ్రిజిరేటర్‌లో సరైన ఉష్ణోగ్రతను పాటించకపోవడం, ఫుడ్ గ్రేడ్ లేని ప్లాస్టిక్ కవర్లలో భారీగా మాంసపు ఉత్పత్తులను నిలువ చేసి, హానికర ప్రమాదకరమైన రంగులను కలిపిన చికెన్ డ్రమ్ స్టిక్స్, తుప్పు పట్టిన వంట పాత్రలను వంటలు తయారు చేయడానికి ఉపయోగించడం, బూజు పట్టిన కూరగాయలను గుర్తించడంతో యాజమాన్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటికప్పుడే 25 వేల విలువైన 20 కేజీల మాంసపు ఉత్పత్తులను ధ్వంసం చేసి నోటీసులు జారీ చేశారు. అలాగే, మిఠాయివాలా స్వీట్ షాప్‌లో తనిఖీ చేయగా మోతాదుకు మించిన హానికరమైన రంగులను స్వీట్స్ తయారీకి ఉపయోగించడం కేక్స్, స్వీట్స్ తయారీలో కాలం చెల్లిన ముడి సరుకులు ఉపయోగించడం, కాలం చెల్లిన తేదీ లేని బ్రెడ్ ప్యాకెట్లు, లేబుల్ డిఫెక్ట్స్ సుమారు రూ.7 వేల విలువైన ఆహార పదార్థాలను గుర్తించారు. వాటిని ధ్వంసం చేసి, యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేసి, నోటీసులను జారీ చేశారు. కేసు నమోదు చేస్తున్నట్టు జ్యోతి రమ్యి తెలిపారు. ఇక నుంచి తరచుగా తనిఖీ చేస్తామని, కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

'హామీల అమలులో ప్రభుత్వం విఫలం'

కలెక్టరేట్, అక్టోబర్ 11 : అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందుతున్నదని తెలంగాణ రైతాంగ వేదిక జిల్లా కన్వీనర్ మాడుగుల ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. శుక్రవారం నగరంలోని కోతిరాంపూర్‌లో గల ఆ సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతు బంధు కింద అందజేస్తున్న పెట్టుబడి సాయం పెంచుతామని, వరి ధాన్యానికి బోనస్ ప్రకటిస్తామని చేసిన వాగ్దానాలు నీటి మూటలుగానే మారుతున్నాయని మండిపడ్డారు. అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా ఇప్పటికీ రైతు బంధు అమలు చేయడం లేదని, యాసంగితో పాటు వానకాలం సీజన్ కూడా ముగుస్తున్నా రైతులు పండించిన ధాన్యానికి బోనస్ ప్రకటించకుండా, సన్నాలకే ఇస్తామంటూ సన్నాయి నొక్కులు నొక్కుతుండడం సిగ్గుచేటని విమర్శించారు. రైతులు అనేక ప్రమాదాలతో మరణిస్తున్నా, వారికి రైతు బీమా కూడా వర్తింపజేయకపోవడం శోచనీయమన్నారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు ఉచిత ఎరువులు పంపిణీ చేస్తామని చేసిన ప్రకటన కాగితాలకే పరిమితమైందని మండిపడ్డారు. ఇప్పటికైనా రైతాంగానికి ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించాలని, లేనిపక్షంలో రైతులను ఏకం చేసి ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో వేదిక ప్రతినిధులు దుండగుల మల్లయ్య, జాడి రాములు, నడిమెట్ల వెంకటయ్య, వైద్యుల మల్లికార్జున్, చెన్నబోయిన రాజు, నర్సింగోజు మధుసూదనాచారితో పాటు పలు మండలాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు.

రైస్ మిల్ నిర్మాణాన్ని నిలిపివేయాలి

గన్నేరువరం, అక్టోబర్ 11: మండల కేంద్రం శివారులో చేపట్టిన రైస్ మిల్ నిర్మాణాన్ని నిలిపివేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్మాణాన్ని పరిశీలించిన అనంతరం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, రైస్ మిల్ ఏర్పాటుతో దుమ్ము ధూళి పాటు పొగ వెలువడి ప్రజలు అనారోగ్య బారిన పడే ప్రమాదం ఉందన్నారు. రైస్ మిల్‌లో పనిచేయడానికి ఇతర రాష్ట్రాల నుంచి కూలీలు వస్తారని, వారితో ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కాంతాల అంజి రెడ్డి, ఎల్లారెడ్డి, మల్లారెడ్డి, వెంకటరెడ్డి, తిరుపతిరెడ్డి, రమణారెడ్డి, మనోహర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌కు నిధుల కేటాయింపుపై ఎస్సీ కమిషన్ నోటీసులు

కార్పొరేషన్, అక్టోబర్ 11: కరీంనగర్ నగరపాలక సంస్థలోని ఎస్సీ రిజర్వ్డ్ 44వ డివిజన్‌కు నిబంధనల ప్రకారం నిధులు కేటాయించడం లేదని కార్పొరేటర్ మెండి శ్రీలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ కలెక్టర్‌కు నోటీసులు ఇచ్చింది. ఈ విషయంలో వెంటనే తగు విచారణ చేసి నివేదికను అందించాలని సూచించింది. 30 రోజుల్లో ఈ నిధుల కేటాయింపు సంబంధించిన విషయంపై పూర్తిస్థాయిలో విచారణ చేసి నివేదికను అందించాలని పేర్కొంది.